క్లుప్తంగా

కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేసిన మాదిగలు

బలిజిపేట: ఈనెల 7వ తేదీన విజయవాడలోని జింఖానా మైదానంలో నిర్వహించనున్న మాదిగల జన జాగృతి సభకు తరలిరావాలని కోరుతూ సోమవారం కరపత్రం విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ సభకు మాదిగలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఎం.ఆనందరావు, జె.రవిమాదిగ, యు.కన్నారావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి



పెదపెంకి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని నూకలవాడ జంక్షన్ నుంచి పెదపెంకి గ్రామానికి రూ.1.72కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 2.50కిలోమీటర్ల బీటీ రోడ్డును త్వరగా పూర్తిగా చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.ఈ రోడ్డు నిర్మాణంతో వంతరాం నుంచి, నూకలవాడ, కూరుంపురం నుంచి పెదపెంకి మీదుగా బొబ్బిలి వెళ్లేందుకు వీలుగా ఉంటుందని, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జి.శ్రీను, నాయకులు, పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషిచేస్తా

● ఎంఈఓ బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ-1గా పదవీబాధ్యతలు చేపట్టిన సింహాచలం

బలిజిపేట: విద్యారంగ అభివృద్ధి మండల విద్యాశాఖ అధికారిగా కృషిచేస్తానని సామల సింహాచలం తెలిపారు. బలిజిపేట ఎంఈఓ-1గా ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. విద్యాశాఖ పరంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేయడం, అందరి సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి పాటుపడతానన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మికి జాయినింగ్ రిపోర్టు అందించి ఎంఆర్‌సీలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు, ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నాడు - నేడు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.చిన్మయిదేవి

పార్వతీపురంటౌన్: నాడు నేడు పథకంలో మంజూరైన అంగన్వాడీ భవనాల నిర్మాణం, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మహిళ, శిశు అభివృద్ధి శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.చిన్మయిదేవి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సామాజిక భవనంలో జిల్లా పరిధిలో గల సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నాడు నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. భవనాల నిర్మాణాల పనులను ప్రస్తుతం ఉన్న దశ నుంచి మూడురోజులలో తరువాత దశకు తీసురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ, మహిళ సాధికారత అధికారిణి కె.విజయ గౌరి, సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

7న ఏకలవ్య పాఠశాలల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

సీతంపేట: ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని పాఠశాలలో 6వ తరగతిలో 25 (13 బాలురు, 12 బాలికలు) సీట్లు, 7వ తరగతిలో 3 (బాలురు), 9వ తరగతిలో 2 (బాలురు) ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. మెళియాపుట్టి పాఠశాలలో ఆరో తరగతిలో బాలురు 9, బాలికలు 8, ఏడో తరగతిలో బాలురు 1, 8వ తరగతిలో బాలురు 1, 9వ తరగతిలో బాలురు 2, బాలికలు 2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



సీతానగరం: పెదంకలాం ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



పట్టణంలోని సాయిబాబా ఆలయంలో చేస్తున్న పూజలు

పార్వతీపురంటౌన్: సర్వజనావళికి దేవుడైన శ్రీ షిరిడీ సాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఎం నగర్, బైపాస్ రోడ్, తదితర సాయి ఆలయాల్లో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పాలాభిషేకాలు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే బాబా వారికి ప్రత్యేక అర్చనలు, ఆరాధనలు భక్తులు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరిగింది.

సీతానగరంలో..

సీతానగరం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలుగ్రామాల్లో గల షిరిడీ సాయి ఆలయాల్లో పూజలు జరిగాయి. మండలకేంద్రంలోని బాలసాయి గణపతి ఆలయంలో నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.పెదంకలాం ఆలయంలో వేదుల నానిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపౌర్ణమి పూజా కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదాలు వితరణ చేశారు. అలాగే నిడగల్లు సాయి నాథ్ మందిరంలో పూజలు నిర్వహించి స్వామివారిని తిరువీధి చేశారు. కె ఎస్‌పురం, బూర్జ తదితర గ్రామాల్లో పౌర్ణమి ఉత్సవాలు జరిగాయి.

ఘనంగా గురుపౌర్ణమి

సాలూరు: గురుపౌర్ణమి సందర్భంగా పట్టణం, మండలంలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు విశేష అర్చనలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలుచోట్ల అన్నసమారాధనలు చేపట్టారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: భారతదేశ క్రిస్టియన్ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాస్టర్ల సంఘం ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని నిరాశ్రయుల వసతి గృహంలో నిర్భాగ్యులు, అనాథలకు పండ్లు, బియ్యంతో పాటు జిల్లా ఆస్పత్రిలో రోగులకు పళ్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ క్రిస్టియన్స్ డే సందర్భంగా పాస్టర్ సంఘం సభ్యులు క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు అందరూ కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, మైనార్టీ సెల్ అధ్యక్షులు, పాస్టర్ల సంఘం అసోసియేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



పెదపెంకిలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 8వ తేదీన పార్వతీపురంలో వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ చేయనున్నామని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. 8వ తేదీన విగ్రహం ఆవిష్కరణ సమయానికి ముందే మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని సూచించారు. జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండలంలోని పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలో డ్రోన్ సహకారంతో సమగ్రంగా భూముల రీసర్వే చేయనున్నామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం అప్పయ్యపేట, పెదభోగిలి గ్రామాల్లో శాటిలైట్ విధానంపై జరుగుతున్న డ్రోన్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూములున్న రైతులకు సంబంధించి లెక్కలు అసలైన రైతుల పేరిట సరిగా లేవని రికార్డుల ద్వారా తెలిసిందని దీంతో భూముల క్రయవిక్రయాలు జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు. ఈ మేరకు భూములకు సంబంధించి నకళ్లున్న రైతుల భూములకు రెవెన్యూ, సర్వే అధికారుల పర్యవేక్షణలో జగనన్న భు రక్ష,భూ హక్కు పథకంద్వారా శాశ్వత హక్కులు కల్పించడానికి డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బషీర్, వీఆర్వో పి.కుమార్ నాయుడు, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

6న రెండో విడత కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలురు, బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 6న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రెండు కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో పది చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. బాలికల కళాశాలలో వొకేషనల్ ఏఅండ్‌టీ గ్రూపులో 10 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్థానిక బాలుర కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇబ్బందులు తొలగాయి



పార్వతీపురంటౌన్: మాది పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస ప్రాంతం. గతంలో ఏ ధృవపత్రాలు కావాలన్నా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నాకు జాబ్ ట్రైనింగ్ కోసం కమ్యూనిటీ, ఆదాయ ధృవపత్రాల కోసం రెండు మూడు పర్యాయాలు దరఖాస్తు చేసినా సాంకేతిక లోపాలవల్ల మంజూరు కాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో తిరిగి సర్టిఫికెట్ కోసం విన్నవించుకున్నాను. నాలుగురోజుల కిందట టోకెన్ ఇచ్చారు. ఇప్పుడు ఆ ధృవపత్రాలను అందజేశారు. సమస్యల పరిష్కారానికి జగనన్న సరక్ష మంచి వేదిక, అధికారులే మా గ్రామాలకు, ఇళ్లకు వస్తున్నారు. మా కుటుంబ అర్హతలను నమోదు చేసి ప్రభుత్వ సేవలను ఉచితంగా అందిస్తుండడంతో ఇబ్బందులు తీరుతున్నాయి.

– నెల్లి వర్షిణి, పార్వతీపురం, కొత్తవలస

నేటి కార్యక్రమాలు

ఉపాధిహామీ ప్రజావేదిక

పాలకొండ రూరల్: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళశారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ సామాజిక తనిఖీలపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఓ ఈశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలో ఏప్రిల్ 2022 నుంచి 2023 మార్చి 31 మధ్య కాలంలో చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారని, అందులో గుర్తించిన అంశాలను ప్రజావేదికలో బహిర్గతం చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

సీతంపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆయన 126వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

పార్వతీపురంటౌన్: నియోజకవర్గ కేంద్రంలో గల ఆర్టీసీ డిపో బస్సు డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషి చేశారు. ఈ మేరకు డ్రైవర్లు సోమవారం ఎమ్మెల్యేను జోగారావును కలవగా వారి సమస్యలను విన్న ఆయన నేరుగా ఆర్టీసీ డిపోకు వెళ్లి మేనేజర్, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారితో సమావేశమై డ్రైవర్ల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషిచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నఖచిత్రం



గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన నఖచిత్రం ఆకట్టుకుంది. గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షి చిత్రాన్ని చేతి గోళ్లతో అద్భుతంగా వేసి పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

– గరుగుబిల్లి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వీరఘట్టం: గత నాలుగు నెలలుగా వీధికుళాయిల నుంచి తాగునీరు సక్రమంగా రాకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సీబీఎం కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలియజేశారు. నాలుగు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా.. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు తమ పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ఈఓ రామచంద్రరావు స్పందిస్తూ..కుళాయి పాయింట్లకు ట్యాంపులు వేయించి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

జగనన్న సురక్ష అమలుకు సమాయత్తం కావాలి



పెదంకలాంలోమాట్లాడుతున్న బి. శ్రీరాములు

సీతానగరం: జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు వలంటీర్లు, గృహ సారథులు సమాయత్తం కావాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. శ్రీరాములు కోరారు. ఈ మేరకు సోమవారం పెదంకలాం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గౌరీశ్వరి అధ్యక్షతన కృష్ణారాయపురం,సుమిత్రాపురం,పెదంకలాం సచివాలయ కన్వీనర్లు,ఆయా గ్రామాల వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా నిర్వహించిన ఇంటింటి సర్వేలో వలంటీర్లు, గృహసారథులు గుర్తించిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు పర్యవేక్షణలో పరిష్కరించడానికి సిద్ధం కావాలని కోరారు. జెడ్పీటీసీ ఎం బాబ్జీ మాట్లాడుతూ ప్రజలసమస్యలను ఇప్పటికే ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కృష్ణారాయపురం సర్పంచ్ జి.అన్నంనాయుడు,మండల జేసీఎస్ కన్వీనర్ యు.సురేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే పెదభోగిలి 1, 2 సచివాలయాల సముదాయంలో ఈఓజె వెంకటరావు ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు, గృహసారథులతో సర్పంచ్ జె.తేరేజమ్మ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, జేసీఎస్ కన్వీనరు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రెండుగ్రామాలకు ఇంటింటి కుళాయిలు



వెంకటాపురంలో ఇంటింటి కుళాయితో నీరును పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన రెండు గ్రామాల్లో ఇంటింటి కుళాయిలతో తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు విడుదల చేసిందన్నారు. అప్పటి సర్పంచ్ సిరికి మహేశ్వరరావు, ఉప సర్పంచ్ బి.తిరుపతిరావుల ఆధ్వర్యంలో వీబీపేటలో రూ.18 లక్షల వ్యయంతో 143 ఇంటింటి కుళాయిలు వేసినట్లు చెప్పారు. వెంకటాపురంలో రూ.19 లక్షల వ్యయంతో 179 ఇళ్లకు ఇంటింటి కుళాయిలు వేశామన్నారు. త్వరలో అంటిపేటలో ఇంటింటి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. అలాగే బగ్గందొరవలసలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

● డీఐఓ జగన్మోహనరావు



అజ్జాడలో కేంద్రాల వద్ద సూచనలు ఇస్తున్న డీఐఓ

బలిజిపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు మండలంలోని అజ్జాడలో సచివాలయం, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారికి కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుతం సీజనల్‌గా జ్వరాలు సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. డ్రైడే పాటించాలని, దోమల ఆవాసాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మందులు, పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సంప్రదించి పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చిన్నమ్ములు, సోనియా, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తపాలాశాఖలో సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

● డివిజన్ కార్యదర్శి ఉమాశంకరరావు

పార్వతీపురం టౌన్: తపాలాశాఖలో సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా తపాలాశాఖ డివిజన్ కార్యదర్శి బి.ఉమాశంకరరావు అన్నారు. ఈ మేరకు రద్దు చేసిన ఏఐపీయూ. ఎన్ఎఫ్‌పీఈ సంఘాలను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఒకరోజు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ సంఘాల తరఫున న్యాయబద్ధంగా పోరాడుతున్న సంఘాలను రద్దు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రయోజనం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో తపాలాశాఖను ప్రైవేటీకరణ చేయడానికి అడుగులు పడుతుండడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘాలను రద్దు చేసి కార్మిక, ఉద్యోగులను బలహీన పరిచే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండడం మంచి పద్ధతి కాదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుమన్, జీడీఎస్ పోస్టులను ఇప్పటివరకు భర్తీ చేయకపోవడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారిపై అదనపు భారం పడుతోందన్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా కార్యకలాపాల పేరుతో వేధింపులను ఆపాలని కోరారు.

ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి 2004 తరువాత చేరిన ఉద్యోగులందరికీ ఓపీఎస్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రవీంద్రనాథ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహావిష్కరణ

సీతంపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆయన 126వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వెలగవాడలో జగనన్న సురక్ష

పాలకొండ: మండలంలోని వెలగవాడ గ్రామంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో సర్వే చేసి గ్రామస్తులకు అవసరమైన సేవలను గుర్తించామని, అందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తిచేశామన్నారు.